# పట్టుచీర

-మల్లాది వెంకట కృష్ణమూర్తి

"వెళ్ళగానే ఫోన్ చెయ్యి" చెప్పాడు రామ్మూర్తి తన భార్యకి.

"అలాగేనండి. మీరు చేయడానికి మా ఇంట్లో ఫోన్ లేదు. ఆఫీస్‌కి చెయ్యను. రాత్రి మన ఇంటికి చేస్తాను" జవాబు చెప్పింది రామ్మూర్తి భార్య కామాక్షి.

"మీ అమ్మ ఆరోగ్యం కుదుటపడగానే వచ్చేయ్"

"అలాగే, నాలుగైదు రోజుల్లో రావడానికి ట్రై చేస్తాను" నాంపల్లి రైల్వే స్టేషన్‌లోంచి రైలు కదిలింది.

రామ్మూర్తి భార్య కనపడేదాకా చేతిని ఊపుతూనే ఉన్నాడు. తర్వాత తిరుగుముఖం పట్టాడు.

అయితే కామాక్షి ఆ రైల్లో తన స్వగ్రామం వెళ్ళలేదు. రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగగానే పెట్టెతో సహా దిగేసింది. బయటికి వచ్చి పార్కింగ్ స్పాట్‌లో ఆగి వున్న ఓ ఫోర్డ్‌కారు దగ్గరకి దారి తీసింది. ఆ కారు డ్రైవర్ కామాక్షిని గుర్తు పట్టినట్టుగా నవ్వి ఆమె చేతిలోని పెట్టెనందుకుని వెనుక తలుపు తెరిచాడు. కామాక్షి వెనుక సీట్లో కూర్చోగానే, పక్కనే కూర్చుని వున్న భాస్కరరావు ఆమె నడుం చుట్టూ చేతిని వేసి తన దగ్గరగా లాక్కుని కూర్చోపెట్టుకున్నాడు.

కారు కదిలింది. సరాసరి ఆ కారు ఓ త్రీస్టార్ హోటల్ ఆవరణలో ఆగింది. చేతిలో గది తాళం చెవితో పక్కన కామాక్షితో భాస్కరరావు హోటల్‌లోకి నడిచాడు.

ఆ శని, ఆదివారాలు కామాక్షి అతనితో 'వైల్డ్ వీకెండ్'ని స్పెండ్ చేసింది. సోమవారం ఉదయం ఇద్దరు విడిపోయేటప్పుడు భాస్కరరావు ఆమెకో సర్‌ప్రయిజ్ గిఫ్ట్ ప్యాకెట్ ఇచ్చాడు.

దానికున్న గిఫ్ట్ రేపర్‌ని చింపి ఆ అట్టపెట్టె తెరచి చూసింది. లోపల కామాక్షికి ఇష్టమైన ఆకుపచ్చ రంగు పట్టుచీర. వెండి జరీ వల్ల ఆ చీర బరువుగా వుంది.

"ఓ! హౌ వండ్రఫుల్! ఎంతిది?" అడిగింది కామాక్షి ఆనందంగా.

"పదిహేను వేలు. మొన్న బిజినెస్ పని మీద మద్రాస్ వెళ్ళినప్పుడు కంచికెళ్ళి కొన్నాను. హైదరాబాద్‌లో అయితే ఇంకో పది కలుపుకోవాలి" చెప్పాడు భాస్కరరావు నవ్వుతూ.

తన ఇంటికి కొద్ది దూరంలో కామాక్షి కారు దిగింది. అంత ఖరీదైన చీరని తన పుట్టింటి వారు పెట్టారని చెప్పి నమ్మించలేదు తన భర్తని. వారికంత స్థోమత లేదు. అంత ఖరీదైన చీరని కామాక్షికి ప్రజంట్ చేసే వాళ్ళెవరూ లేరు. అది ఎలా వచ్చిందని చెప్పాలి? ఆ చీర మీద కామాక్షికి వ్యామోహంగా వుంది. ఆ విషయం ఆలోచిస్తూ ఇంటికి నడుస్తుంటే, దారిలో తన భర్త అవసరానికి తన బంగారు గాజులు తాకట్టు పెట్టే షాపు కనబడగానే తటాలున ఓ ఆలోచన స్ఫురించింది. షాపులోకి వెళ్ళి ఆ చీర మార్వాడి అతనికి చూపించి అడిగింది.

## నాగరిక మానవుడు

అనేక సద్గుణాలతో పాటు నాగరికుడైన మానవునికి ధర్మము, దయ, దానము అంటే ఆత్మసంనియమం, కనికరం, దాతృత్వం అనే మూడు గుణాలు ముఖ్యంగా ఉండాలి. సమాజ శ్రేయస్సు కోసం సంనియమం వల్ల ఆత్మ సంతృప్తి కలుగుతుంది. కనికరం వల్ల మానసిక భావాలు మృదువుగా ఉంటాయి. ఊరికే డబ్బు చేతిలో పెట్టడం కాదు - దాతృత్వం దాతృత్వ భావం మనసులో వృద్ధి పొందాలి. ఇతరుల బాధలు తెలుసుకోడానికి మానవ నాగరికతకు ఈ మూడు లక్షణాలు ముఖ్యం.

- వై.కె.మూర్తి




"దీన్ని తీసుకుంటారా? వెండి జరీ చీర కొత్త చీర". "ఎంత కావాలి?" అడిగాడతను ఆ చీరని పరిశీలించి.

"రెండు వందలు చాలు"

ఆమె కోరినట్లుగా రెండు వందల రూపాయలు, రసీదు ఇచ్చాడతను.

"రసీదు ఎవరు తెచ్చినా చాలు కదా? అడిగింది. చాలన్నట్లుగా తల వూపాడు తను.

ఆఫీస్‌నించి సాయంత్రం ఇంటికొచ్చిన రామ్మూర్తి తన భార్యని చూసి సంతోషించాడు. పుట్టింటి విశేషాలు కొన్ని కల్పించి చెప్పాక కామాక్షి చాలా క్యాజువల్‌గా ఆ పాన్ రసీదుని తన భర్తకి చూపించి చెప్పింది.

"ఇది చూడండి".

"ఇదెక్కడిది?" అడిగాడు రామ్మూర్తి.

"ఇందాక వస్తుంటే రోడ్డు మీద దొరికింది".

"ఇది మార్వాడి దుకాణం వాళ్ళిచ్చిన తాకట్టు రసీదు. ఎవరిదో కాని జారవిడుచుకున్నారు పాపం".

"ఇది ఎవరిదో ఎలా తెలుస్తుంది మనకు?

"కష్టమే. రెండు వందలకి ఏదో వస్తువు తాకట్టు పెట్టుకున్నారు".

"మనం ఆ రెండు వందలు పెడితే ఆ వస్తువు మనకిచ్చేస్తారు కదండి?" అమాయకత్వం నటిస్తూ అడిగింది కామాక్షి.

"ఇచ్చేస్తారు"

"ఆ వస్తువు ఖరీదు రెండు వందల కంటే ఎక్కువే అయి వుంటుంది".

"అవును."

"బంగారు ఉంగరం లాంటి ఖరీదైంది అయి వుంటుంది. దాన్ని మనం విడిపించుకోవచ్చుగా?" అడిగింది మళ్ళీ.

"ఓ యస్. లంచ్ అవర్‌లో వెళ్ళి చూస్తాను. అదేమిటో" చెప్పాడు రామ్మూర్తి.

మర్నాడు సాయంత్రం భర్త ఆఫీస్ నించి ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తాడా, ఎప్పుడు తనా చీర కట్టుకోవచ్చా అని ఆత్రంగా ఎదురుచూడసాగింది కామాక్షి.

లంచ్ టైంలో అతనికి ఫోన్ చేసి గుర్తు కూడా చేసింది, ఆ పాన్‌షాపుకి వెళ్ళి రమ్మని.

సాయంత్రం ఉత్త చేతులతో వచ్చిన భర్తని చూసి నిష్ఠూరంగా అడిగింది.

"షాపుకి వెళ్ళనే లేదా మీరు?"

"వెళ్ళాను. అదో చీప్ వాచీ. రెండొందలు పెట్టి విడిపించడం దండగని మానేసాను".

కామాక్షికి అది తప్పని చెప్పాలని నోటి దాకా వచ్చింది. కాని నిభాయించుకుంది. పొరబాటు ఎక్కడ జరిగిందో అర్థం కాలేదు ఆమెకి. ఆ రహస్యం శ్రావణ శుక్రవారం పేరంటానికి వెళ్ళినప్పుడు తెలిసింది కామాక్షికి. అక్కడికి వచ్చిన, తన భర్త ఆఫీస్‌లో పనిచేసే టైపిస్ట్ ఆ పట్టు చీర కట్టుకుని ఉండడం చూసింది. అది ఏ షాపులో ఎంతకి కొన్నారని అడిగింది కామాక్షి.

వెంటనే సరయిన జవాబు చెప్పడానికి ఆమె తడబడడం వల్ల, జరిగింది కామాక్షి తేలికగా వూహించగలిగింది. ○

## చెప్పుకోండి చూద్దాం!



ఈ చిన్నారిని గుర్తుపట్టగలరా? నిమ్మలూరు గ్రామంలో జన్మించింది. 'విశిష్టమైన పువ్వులకుండే తావి, మేలిమి బంగారంకుండే విలువ సంతరించి పుణికిపుచ్చుకున్న సార్థక నామధేయురాలు ఈమె! ఊహాంబరవిహారి. స్వేచ్ఛా సాధకురాలు' అని విమర్శకులు పేర్కొన్న ఈమె ఒక తరం పాఠకుల్ని సమ్మోహపరచిన 'మోహనరాశి'. నవలా రచయిత్రి. నిర్భయురాలు. అన్నట్టు ఈమెది విజయవాడే. ఈ బాలిక ఎవరో కాదు- జానకీ రామకృష్ణ హేమలత! అంటే 'లత'. బాల లత గారి మధుర స్మృతి ఇది!

*(సేకరణ: ద్వా.నా. శాస్త్రి)*